ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాల భర్తీ

- ఇప్పటికే 30 వేల ఉద్యోగాలకు నియామకపత్రాలిచ్చాం
- ఆందోళనలు వద్దు.. సహేతుకమైన సమస్యలను పరిష్కరిస్తాం
- ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌లో సిఎం రేవంత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఏడాదిలోపు 60 వేల ఉద్యోగాలు భర్తీ చేసి నిరుద్యోగుల పట్ల తమ చిత్తశుద్ధిని చాటుకున్నామని, ప్రభుత్వం ఏర్పడిన 90 రోజుల్లోనే 30 వేల ఉద్యోగాలకు నియామకపత్రాలు అందజేశామని, మరో 30 వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇచ్చినట్టు సిఎం రేవంత్‌రెడ్డి తెలిపారు. జాబ్ క్యాలెండర్ ద్వారా ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వం పనిచేస్తుందని మరోమారు స్పష్టం చేశారు. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం నార్సింగి మున్సిపాలిటీ గౌలిదొడ్డిలోని తెలంగాణ ఫైర్ సర్వీసెస్ అండ్ సివిల్ డిఫెన్స్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం నిర్వహించిన ఫైర్‌మెన్ పాసింగ్ అవుట్ పరేడ్‌కు సిఎం రేవంత్‌రెడ్డి హాజరయ్యారు. ముందుగా సీఎం గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో సిఎం మాట్లాడారు.

గతంలో 30 వేల మంది నియామక పత్రాలు అందుకున్న వారిలో 483 ఫైర్‌మెన్లు, 155 డ్రైవర్ ఆపరేటర్స్ కూడా ఉన్నారని, వారిప్పుడు కఠిన శిక్షణ కూడా పూర్తి చేసుకోవడం సంతోషంగా ఉందన్నారు. వారికి ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు. నిరుద్యోగ యువకుల్లో విశ్వాసం కల్పించడమే ప్రాధాన్యతగా ప్రభుత్వం పనిచేస్తోందన్నారు. యువత పారదర్శకంగా విధులు నిర్వహించాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి ఆపద వచ్చినా ప్రాణాలను లెక్కచేయకుండా అగ్నిమాపక సిబ్బంది ముందుండి ప్రజలను కాపాడతారని కొనియాడారు. ఉద్యోగాల్లో 90 శాతం మంది గ్రామీణ ప్రాంతాల వారు ఉండటం సంతోషకరమన్నారు. నిరుద్యోగుల సహేతుకమైన సమస్యలను పరిష్కరించడానికి ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుందని, ఎవరూ నిరసనలు, ఆందోళనలు చేయాల్సిన అవసరం లేదన్నారు.

రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా వైద్యా రంగాలకు పెద్దపీట వేశామన్నారు. వ్యవసాయ రంగాన్ని మరింత పటిష్టం చేస్తేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఇందులో భాగంగానే వ్యవసాయం, విద్యా రంగాలను అధిక నిధులు కేటాయించినట్టు చెప్పారు. ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం యజమానిగా ఉంటుందన్నారు. వారి బాగోగులను చూసుకోవడానికి ప్రతి నెలా మొదటి తేదీనే జీతం ఇస్తుందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ముఖ్యమంత్రి సలహాదారు శ్రీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్సీలు పట్నం మహేందర్‌రెడ్డి, ఎగ్గె మల్లేశం, ఎమ్మెల్యే ప్రకాశ్ గౌడ్, పోలీసు, అగ్నిమాపక శాఖ ఉన్నతాధికారులు, సింగిల్ విండో ఛైర్మెన్ రామ్ దాస్‌ముదిరాజ్, మాజీ ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

'ధరణి' స్థానంలో నూతన చట్టం : సిఎం

ధరణితో తలెత్తుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారానికి మరింత లోతుగా అధ్యయనం చేయాల్సి ఉందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. భూ సమస్యలు నానాటికీ ఎక్కువవుతుండడంతో సమ్రగ చట్టం రూపొందించాల్సి ఉందన్నారు. ధరణి సమస్యలపై శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఒకప్పుడు గ్రామ స్థాయిలోనే అందుబాటులో ఉండే రికార్డులు చట్టాల మార్పుతో క్రమంగా మండల కేంద్రానికి, తర్వాత జిల్లా కేంద్రానికి, రాష్ట్ర స్థాయికి వెళ్లిపోయాయన్నారు. గతంలో భూ సమస్యల పరిష్కారానికి అప్పీలు చేసుకునే అవకాశం ఉండేదని గుర్తు చేశారు. ధరణితో గ్రామ, మండల స్థాయిలో ఏ సమస్యకు పరిష్కారం లేకుండాపోయిందని, సమస్త అధికారాలు జిల్లా కలెక్టర్‌కు అప్పజెప్పారన్నారు. అక్కడ కూడా సమస్య పరిష్కారం కావడం లేదని, కలెక్టర్లు తీసుకునే ఏ నిర్ణయాన్ని ప్రశ్నించే అవకాశం లేకుండా ధరణిని రూపొందించారన్నారు. ఈ నేపథ్యంలో భూ సమస్యల పరిష్కారానికి విస్తృతస్థాయి సంప్రదింపులు చేపట్టాలని, ప్రజల నుంచి సలహాలు, సూచనలు స్వీకరించాలని ముఖ్యమంత్రి అన్నారు. అలాగే అఖిలపక్ష భేటీ ఏర్పాటు చేసి అందరి అభిప్రాయాలతో సమగ్ర చట్టం తీసుకురావల్సి ఉందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. భూదాన్, పోరంబోకు, బంచరాయి, ఇనాం, కాందిశీకుల భూముల సమస్యలున్న ఓ మండలాన్ని ఎంపిక చేసుకొని, అక్కడ ఎదురవుతున్న సమస్యలపై అధ్యయనం చేసి సమగ్ర నివేదిక రూపొందిస్తే ఆ సమస్యలపైనా పూర్తి స్పష్టత ఏర్పడుతుందన్నారు. అవసరమైతే వీటన్నింటిపై శాసనసభలో చర్చ చేసి తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు. సమావేశంలో రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేశవరావు, ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, మాజీ మంత్రి జానా రెడ్డి, ధరణి కమిటీ సభ్యులు కోదండరెడ్డి, సునీల్ కుమార్, రేమండ్ పీటర్, మధుసూదన్, సిసిఎల్‌ఏ నవీన్ మిట్టల్ పాల్గొన్నారు.

స్థానిక ఎన్నికల ప్రక్రియ వేగవంతం చేయండి..

స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను వేగవంతం చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికలపై శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభించడానికి ఉన్న ఆటంకాలు ఏమిటని ముఖ్యమంత్రి అధికారులను ప్రశ్నించారు. భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) నుంచి రాష్ట్ర ఎన్నికల సంఘానికి (ఎస్‌ఇసి) నూతన ఓటర్ల జాబితా రావాల్సి ఉందని అధికారులు తెలిపారు. అందుకు ఎంత సమయం పడుతుందని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. ఇప్పటికే రెండు రాష్ట్రాలకు ఇసిఐ జాబితా పంపిందని, మనతో పాటు మరో ఆరు రాష్ట్రాలకు మరో వారంలో జాబితాలు పంపిస్తుందని అధికారులు సమాధానమిచ్చారు. జాబితా రాగానే వెంటనే ఎన్నికల ప్రక్రియ ప్రారంభించాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. సమావేశంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు దామోదర రాజనరసింహ, సీతక్క, పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చెరుపల్లి సీతారాములు

బడ్జెట్‌లో వృత్తిదారులకు మొండిచేయి

- ఎన్నికల హామీలకు, బడ్జెట్‌కు పొంతనే లేదు
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

బడ్జెట్‌లో వృత్తిదారులకు ప్రభుత్వం మొండిచేయి చూపిందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం పుట్టపాక గ్రామంలో శక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన బడ్జెట్ ఎన్నికల ముందు చేసిన వాగ్దానాలకు, కాంగ్రెస్ మేనిఫెస్టోకు సారూప్యత లేదన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి లేదన్నారు. అసమానతలతో కూడుకున్న బడ్జెట్ అని తెలిపారు. చేనేత రంగానికి రూ.367 కోట్లు కేటాయించినప్పటికీ జీతభత్యాలకే సరిపోదన్నారు. ఎన్నికల ముందు వరికి రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి సన్నవడ్లకు మాత్రమే ఇస్తామనడం సరికాదన్నారు. అన్ని రకాల వడ్లకు మద్దతు ధరతో పాటు బోనస్ ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. రైతు భరోసాపై స్పష్టత లేదన్నారు.

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి గుండుసున్నా పెట్టిందని విమర్శించారు. దీనిపై సిపిఎం పోరాటం చేస్తుందన్నారు. ఉమ్మడి జిల్లా ప్రాజెక్టులు డిండి ఎత్తిపోతలు, ఎస్‌ఎల్బీసి సొరంగం పూర్తి చేయాలన్నారు. వివిధ రంగాలకు కేటాయించిన నిధులను విడుదల చేసి ఖర్చు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాకు చెందిన ఉత్తమ్ కుమార్ రెడ్డి భారీ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నారని, ఇకనైనా ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలన్నారు. మూసి సుందరీకరణ తప్ప ప్రక్షాళనకు నిధుల ఊసే లేదన్నారు. బడ్జెట్ సవరణల్లోనైనా ప్రజా కోణంతో నిధుల కేటాయింపులు ఉండాలని తెలిపారు. రాజకీయ భేషజాలకు భిన్నంగా బడ్జెట్ రూపాకల్పన జరగాలని సూచించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 9 నెలలవుతోందని, రాజకీయ మాటలతో కాలయాపన చేయడం తగదన్నారు. అభివృద్ధి, సంక్షేమం వేగవంతం చేయాలని కోరారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. డిండి ఎత్తిపోతల పథకానికి నీళ్లు ఎక్కడి నుంచి ఇస్తారనే స్పష్టత ప్రభుత్వానికి లేదన్నారు. ఈ సమావేశంలో సిపిఎం యాదాద్రి భువనగిరి జిల్లా కార్యదర్శి ఎండి.జహంగీర్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు మాటూరి బాలరాజు, దోనూరు నర్సిరెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు బూర్గు కృష్ణారెడ్డి, జి.శ్రీనివాసాచారి, ఎండి పాషా, పుట్టపాక మాజీ ఎంపిటీసీ మర్రి వసంత, గడ్డం వెంకటేష్, సీనియర్ నాయకులు దొంతగాని పెద్దులు, తుమ్మల నర్సిరెడ్డి, అయితరాజు గాలయ్య, పల్లె మధు, పిట్ట రాములు, ఉప సర్పంచ్ వర్కాల చంద్రశేఖర్ ఉన్నారు.

29 నుంచి 'సింగరేణి పరిరక్షణ యాత్ర'

- బస్సుయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణలోని బొగ్గు బ్లాకులను సింగరేణికే నేరుగా కేటాయించాలనీ, వేలం పాటను ఆపాలని డిమాండ్ చేస్తూ సిపిఎం ఆధ్వర్యంలో ఈనెల 29 నుంచి సింగరేణి పరిరక్షణ యాత్రను చేపడుతున్నట్టు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎస్ వీరయ్య చెప్పారు. అదేరోజు ఉదయం మంచిర్యాల జిల్లా బెల్లంపల్లిలో తమ పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం యాత్రను ప్రారంభిస్తారని అన్నారు. వచ్చేనెల ఐదో తేదీ వరకు ఎనిమిది రోజులపాటు ఈ బస్సుయాత్ర కొనసాగుతుందనీ, కొత్తగూడెంలో ముగింపు సభ ఉంటుందని వివరించారు. ఈ యాత్రను తాను నాయకత్వం వహిస్తాననీ, రాష్ట్ర కమిటీ సభ్యులు భూపాల్, పి ఆశయ్య సభ్యులుగా ఉంటారని చెప్పారు. సింగరేణి పరిరక్షణ యాత్రకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం హైదరాబాద్‌లోని సిపిఎం రాష్ట్ర కార్యాలయం ఎంబీ భవన్‌లో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు జి నాగయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి జ్యోతి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరయ్య మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా సింగరేణి ప్రాంతంలోని శ్రావణపల్లి బొగ్గుబ్లాకుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం వేలంపాట నిర్వహిస్తున్నదని చెప్పారు. కేంద్ర గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి దాన్ని ప్రారంభించారని అన్నారు. బొగ్గు గనుల తవ్వకాల కోసమే సింగరేణి సంస్థ ఏర్పడిందని గుర్తు చేశారు. చౌకగా విద్యుత్ ఉత్పత్తికి ఉపయోగపడే బొగ్గును ఇస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వనరులను సమకూరుస్తున్నదని వివరించారు. సింగరేణి సంస్థను నీరుగార్చి, దాన్ని దెబ్బతీసేలా బొగ్గుబ్లాకులను వేలంపాటను నిర్వహిస్తున్నారని విమర్శించారు. ప్రయివేటు సంస్థలకు బొగ్గుబ్లాకులను కేటాయిస్తే సింగరేణి నిర్వీర్యమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. శ్రావణపల్లి బొగ్గు బ్లాకును నేరుగా సింగరేణికే కేటాయించాలని డిమాండ్ చేశారు. బిఆర్‌ఎస్ హయాంలో రెండు బొగ్గుబ్లాకులను ప్రయివేటువారికి అప్పగించారని చెప్పారు. కార్మికులు, ప్రజలను చైతన్యవంతం చేయడానికే సింగరేణి పరిరక్షణ యాత్రను చేపడుతున్నామని వివరించారు.

సింగరేణి ప్రయివేటీకరణ దిశగా ప్రభుత్వాల నిర్ణయాలు

తెలంగాణకు చెందిన కిషన్‌రెడ్డి కేంద్ర గనుల శాఖ మంత్రిగా ఉండడం వల్ల సింగరేణిని కాపాడుకోవడం సులభమని అందరూ భావిస్తారని వీరయ్య అన్నారు. రాష్ట్రంలో ఎనిమిది మంది బిజెపి ఎంపీలున్నారని చెప్పారు. వారంతా ప్రజల ఆశలను అడియాశలు చేశారని విమర్శించారు. మోడీని మోయడానికే ఉన్నారు తప్ప ఓట్లేసిన ప్రజల ప్రయోజనాలను కాపాడ్డం లేదన్నారు.

కెరీర్ ప్రోగ్రామ్‌లో పరిమిత సీట్లు : ఎన్‌యు వెల్లడి

హైదరాబాద్ బ్యూరో : ఎన్‌ఐఐటి యూనివర్శిటీ (ఎన్‌యు) అత్యాధునిక కెరీర్ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికిపరిమిత సీట్లు అందుబాటులో ఉన్నాయని ఆ యూనివర్సిటీ ఓ ప్రకటనలో తెలిపింది. అడ్మిషన్ల ప్రక్రియ త్వరలో ముగియనుందని పేర్కొంది. రాష్ట్ర కౌన్సెలింగ్‌లో తాము కోరుకున్న విభాగంలో సీటు పొందని దక్షిణ భారతదేశ అభ్యర్థులు తమ ప్రాధాన్య విభాగంలో సీటును ఎన్‌యులో పొందే అవకాశం ఉందని పేర్కొంది. పూర్తి వివరాలకు తమ వెబ్‌సైట్‌ను సందర్శించాలని తెలిపింది.

విద్యార్థులపై కోతుల దాడి

- 9 మందికి గాయాలు

హైదరాబాద్ బ్యూరో : పాఠశాలలో విద్యార్థులపై కోతులు దాడి చేశాయి. తొమ్మిది మంది గాయపడ్డారు. ఈ ఘటన సూర్యాపేట జిల్లా చివ్వెంల మండలంలోని వట్టిఖమ్మంపహాడ్ గ్రామంలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రాథమిక పాఠశాల, ఉన్నత పాఠశాలలో విద్యార్థులపై ఉదయం కోతులు దాడి చేశాయి. దాడిలో విద్యార్థులు దొడ్డిరామ్, కలకొండ రియ, గోగుల ప్రతీక్, రావిచెట్టి ఆజ్ఞసి, నవ్యశ్రీ, కలకొండ రక్షిత్, నవిలె ఈశ్వర్ ప్రసాద్, షేక్ బషీర్, జి.హాసినికి గాయాలయ్యాయి. వారికి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించారు. వ్యాక్సినేషన్ కోతుల నియంత్రణకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్మితా సబర్వాల్ వ్యాఖ్యలు రాజ్యాంగ విరుద్ధం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఐఎఎస్ అధికారిణి స్మితా సబర్వాల్ వ్యాఖ్యలపై తెలంగాణ జన సమితి (తెజస) అధ్యక్షుడు ఆచార్య కోదండరాం మండిపడ్డారు. వికలాంగులపై ఆమె చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. వైకల్యం పేరుతో వారి హక్కులను హరించడం సరికాదన్నారు. 'దివ్యాంగులు కొన్ని ఉద్యోగాలకు పనికిరారని స్మితా సబర్వాల్ చేసిన వ్యాఖ్యలు రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధం. వాళ్లు సకలాంగుల కంటే ఎంతో ఉన్నత శిఖరాలను అధిరోహించారు. చట్టాలను అమలు చేయాల్సిన ఎఐఎస్ అధికారిణి వైకల్యాన్ని కించపర్చడం సమంజసం కాదు. స్మితా సబర్వాల్.. తాను చేసిన వ్యాఖ్యలను వెనక్కితీసుకోకపోగా.. సమర్థించుకోవడం శోచనీయం. భవిష్యత్తులో ఇలాంటి చేయకుండా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి"అని కోదండరాం అన్నారు.

యువత భవిష్యత్తును బలి చేసుకోవద్దు

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలకు బానిసలుగా మారి యువత తమ జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి సూచించారు. మదాపూర్ రేవ్ పార్టీలో ఇటీవల పట్టుబడ్డ 20 మందికి వారి కుటుంబ సభ్యుల సమక్షంలో శుక్రవారం హైదరాబాద్‌లోని ఆబ్కారీ భవన్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లక్షల్లో సంపాదిస్తూ.. మంచి ఉద్యోగం చేస్తున్న వారు సైతం ఈ మాఫియా చట్రంలో చిక్కుకుని తమతోపాటు తమ కుటుంబాలను రోడ్డుకీడుస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి అసాంఘిక కార్యక్రమాల్లో పిల్లలు, భర్తలు, పాలుపంచుకుంటుంటే తల్లిదండ్రులుగా, కట్టుకున్న ఇల్లాలుగా మీరేంచేస్తున్నారని వారిని ప్రశ్నించారు. భవిష్యత్‌లో ఇలాంటి తప్పులు చేయకుండా కుటుంబ సభ్యులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కార్యక్రమంలో ఎక్సైజ్ ఇఎస్ ప్రదీప్‌రావు ఇతర సిబ్బంది, పాల్గొన్నారు.

అమనగల్‌కు 'సెల్‌బే' విస్తరణ



హైదరాబాద్ : తెలంగాణకు చెందిన మల్టీబ్రాండ్ మొబైల్ ఫోన్ రిటైల్ చెయిన్ సెల్‌బే కొత్తగా తన కార్యకలాపాలను ఆమనగల్‌కు విస్తరించినట్లు ప్రకటించింది. ఇక్కడి స్టోర్‌లో మొబైల్ హ్యాండ్‌సెట్‌లు, ఉపకరణాలు, స్మార్ట్ వాచ్‌లు, స్మార్ట్ టివిలు, ల్యాప్‌టాప్‌లు, వ్యక్తిగత సంరక్షణ తదితర ఉత్పత్తులు లభ్యం అవుతాయని సెల్‌బే సంస్థ వ్యవస్థాపకులు, ఎండి సోమ నాగరాజు తెలిపారు. డిస్కౌంట్ ధరలో అనేక రకాల ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తులను పొందవచ్చన్నారు. రూ.29 నుంచి ఇయర్‌ఫోన్స్ నుంచి అనేక రకాల ప్రీమియం ఉత్పత్తుల వరకు అందుబాటులో ఉంటాయన్నారు. మారుమూల ప్రాంతాల్లోకి విస్తరించే యోచనతోనే టైర్3 నగరాల్లోకి ప్రవేశిస్తున్నామన్నారు.



సినారె సాహిత్యంపై అధ్యయనం అవసరం

- రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ శ్రీధర్

ప్రజాశక్తి - కల్చరల్

విఖ్యాత కవి సి.నారాయణరెడ్డి కేవలం సినీ పాటల కవిగా కాకుండా ఆయన రాసిన ఖండ కావ్యాలు ఘజల్స్ సాహితీ సంపద అని రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ మాజీ చైర్మన్ అయాచితం శ్రీధర్ అన్నారు. సినారె సాహిత్యంపై లోతైన అధ్యయనం చేయాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. శ్రీ త్యాగరాయ గాన సభలోని కళా సుబ్బారావు కళావేదికపై ప్రముఖ మహిళా సాంస్కృతిక సేవా సంస్థ రాగ రాగిణి నిర్వహణలో డాక్టర్ సినారె జయంతి సభ జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న అయాచితం శ్రీధర్ సినారె సాహిత్య పురస్కారం ప్రఖ్యాత రచయిత్రి డాక్టర్ సి.మృణాళినికి బహూకరించి మాట్లాడారు. మాటలు రాతల్లో పదును ఉండే మృణాళిని అపార విజ్ఞానఖని అని ప్రశంసించారు. వక్తగా నిర్మోహ మాటంగా అభిప్రాయాలు వెలిబుచే మృణాళిని సాహిత్యంలో వివిధ ప్రక్రియలలో రచనలు ఆలోచనాత్మక విశ్లేషణతో చేశారని వివరించారు. అధ్యక్షత వహించిన దక్షిణ మధ్య రైల్వే విశ్రాంత జనరల్ మేనేజర్ సి రామకృష్ణ మాట్లాడుతూ.. పరిశోధకుడు రాళ్ళపల్లి అనంత కృష్ణ శర్మ వారసురాలిగా మృణాళిని సాహిత్యం, సంగీతం పరిశోధనలో ప్రతిభాశాలి అని కొనియాడారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్ధనమూర్తి తమ అభినందనలు తెలిపారు. సంస్థ అధ్యక్షురాలు రమణ కుమారి స్వాగతం పలికిన సభకు కార్యదర్శి సుబ్బలక్ష్మి వందన సమర్పణ చేశారు. అనంతరం రమణ కుమారి బృందం సినారె గీతాలు మధురంగా గానం చేయగా ఆనంద్ వ్యాఖ్యానం ఆకట్టుకుంది.

లక్ష్యం మేరకు ఆస్తి పన్ను వసూలు

- జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లక్ష్యం మేరకు ప్రాపర్టీ ట్యాక్స్ వసూలు చేయాలని, అందుకు తగిన చర్యలు తీసుకోవాలని జిహెచ్ఎంసి కమిషనర్ ఆమ్రపాలి అన్నారు. శుక్రవారం జోనల్ అడిషనల్ కమిషనర్లతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సిఆర్ఎంపి ద్వారా చేపట్టిన రోడ్లకు సంబంధించిన ఏజెన్సీలతో చేసుకున్న అగ్రిమెంట్‌కు డిసెంబర్ వరకు గడువు ఉండటంతో పెండింగ్‌లో ఉన్న మెయింటెనెన్స్ పనులు వెంటనే పూర్తి చేయించాలని ఆదేశించారు. ఏజెన్సీ ఒప్పందంలో ఉన్న అంశాలకు పెండింగ్ పనులను పూర్తి చేయాలని తెలిపారు. అవసరమైతే ఏజెన్సీలతో జోనల్ స్థాయిలో సమీక్ష చేసి ఒప్పందం చేసుకునే విధంగా ఏమైనా గ్యాప్ ఉంటే వెంటనే పనులు చేయించాలని చెప్పారు. డెంగ్యూ నియంత్రణకు అవగాహన కార్యక్రమాలను మరింత ముమ్మరంగా చేపట్టాలని తెలిపారు. దోమలతో వచ్చే వ్యాధులతో పాటుగా ఈగల ద్వారా వచ్చే వ్యాధులపై కూడా అవగాహన కల్పించాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతపై నగర వాసులు దృష్టి సారించాలన్నారు. కమ్యూనిటీ హాల్స్ వివరాలు సర్కిల్స్ వారీగా పూర్తి నివేదిక సమర్పించాలని కమిషనర్ ఆదేశించారు.

'సీతారామ'కు రూ.2 వేల కోట్లు కేటాయించండి

- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

సీతారామ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన నిధులు సరిపోవని, బడ్జెట్ సవరించి రూ.2 వేల కోట్లు కేటాయించాలని, ప్రాజెక్టు భూనిర్వాసితులకు ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ప్రకారం పరిహారం అందించాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు పోతినేని సుదర్శన్‌రావు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లా కామేపల్లి మండల కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు దుగ్గి కృష్ణ అధ్యక్షతన జరిగిన కామేపల్లి, కారేపల్లి సంయుక్త మండలాల రైతు సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఏడు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే సీతారామ ప్రాజెక్టుకు రాష్ట్ర బడ్జెట్‌లో కేటాయించిన రూ.687 కోట్లు భూసేకరణ నష్టపరిహారంకే సరిపోవని, రాష్ట్ర బడ్జెట్ సవరించి రూ.2 వేల కోట్లకు పెంచి సత్వరమే ప్రాజెక్టు పూర్తి చేయాలని అన్నారు. అందుకు జిల్లా మంత్రులు ముగ్గురూ ప్రయత్నం చేయాలని కోరారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బొంతు రాంబాబు మాట్లాడుతూ.. ప్రభుత్వాలు మారినప్పుడల్లా ప్రాజెక్టుల డిజైన్లు మారుతున్నాయే తప్ప అవి పూర్తి కావడం లేదన్నారు. సీతారామ ప్రాజెక్ట్ పాపకొల్లు గుట్టల దగ్గర తవ్వకాలు నిలిపివేశారని, దీని వల్ల కామేపల్లి, కారేపల్లి, రఘునాధపాలెం మండలాలకు సాగునీరు అందే పరిస్థితి లేదని, తక్షణమే ఆగిపోయిన పనులు పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్ట్ భూనిర్వాసితులకు ఎకరాకు రూ.10.50 లక్షలు పరిహారం అందించడం అన్యాయమని, ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధర ప్రకారం అందించాలన్నారు.

ప్రజావాణికి 681 దరఖాస్తులు

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 681 దరఖాస్తులు అందాయని ప్రత్యేక అధికారి దివ్య తెలిపారు. దరఖాస్తులను ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి, దివ్య స్వీకరించారు. రెవెన్యూ శాఖకు 69, పౌరసరఫరాల శాఖకు 132, విద్యుత్‌శాఖకు 87, హౌజింగ్‌కు 232 దరఖాస్తులు, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖకు 31, ఇతర శాఖలకు సంబంధించి 130 దరఖాస్తులు అందినట్టు అధికారులు తెలిపారు.

కార్మికుల భరోసాకు నిధుల్లేని రాష్ట్ర బడ్జెట్

- అఖిలభారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్


సమావేశంలో మాట్లాడుతున్న బి వెంకట్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

భూమిలేని పేదలకు ప్రభుత్వ భూములను, పోడు భూములను పంపిణీ చేయడం, ఇళ్ల స్థలాలు కేటాయించడం వంటి భూ సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్‌లో విస్మరించాయని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ విమర్శించారు. వ్యవసాయ కార్మికులకు రూ.12 వేలు ఆర్థిక భరోసా ఇస్తామని ఆర్భాటంగా ప్రచారం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం బడ్జెట్లో నామమాత్రపు నిధులను కేటాయించటం పాలకుల చిత్తశుద్ధికి నిదర్శనమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు జి.నాగయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బడ్జెట్ కేటాయింపుల్లో బిజెపియేతర పార్టీల పాలిత రాష్ట్రాల పట్ల వివక్షకు వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీ, ఇండియా బ్లాక్ ఐక్య పోరాటాలను నిర్మించడం కోసం నడుం బిగించాలని సూచించారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నీరుగార్చి పేదల బతుకులను ఓపెన్ మార్కెట్లో వేలం వేశారని వెంకట్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామీణ ఉపాధికి కేంద్రం అదనపు నిధులు కేటాయించలేదని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్లో మ్యాచింగ్ గ్రాంట్‌గా 10 శాతం నిధులను కేటాయించాల్సి ఉన్నా... ఒక్క పైసా కేటాయించకపోవడం ఉపాధి కల్పన బాధ్యత నుంచి తప్పుకోవడానికే అని ఆరోపించారు. కేంద్రం కేటాయించిన నిధుల్లో ఎక్కువ భాగం గత బకాయిలకే పోయే ప్రమాదం ఉందని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా నాలుగు నెలలకు పైగా చేసిన పనికి కార్మికులకు బకాయిలు చెల్లించలేదని గుర్తుచేశారు. పని దినాలను 150 రోజులకు పెంచుతాం , రోజు కూలీ రూ.400 ఇస్తాం, పట్టణ పేదలకు ఉపాధి పనిని విస్తరింపచేస్తామని ఎన్నికల్లో వాగ్దానం చేసిన రేవంత్ రెడ్డి బడ్జెట్‌లో ఒక్క పైసా కేటాయించలేదని విమర్శించారు. నియోజకవర్గానికి 3,500 చొప్పున రాష్ట్రంలో 4 లక్షల 50 వేల ఇండ్లు కట్టిస్తామని చెప్పిన ప్రభుత్వం అందుకోసం బడ్జెట్లో కేటాయించిన రూ. 8,424 కోట్లు ఏ మూలకు సరిపోవని ఎండగట్టారు. తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం ఇస్తామన్న రూ.5 లక్షల చొప్పున లెక్కేసినా రూ. 22,500 కోట్లు అవసరమవుతాయని చెప్పారు దీనిలో మూడోవంతు కూడా కేటాయించకుండా ఏ విధంగా ఇండ్లు నిర్మిస్తారని ప్రశ్నించారు. వ్యవసాయ కార్మికులకు కూలి భరోసా కింద రూ.902 కోట్లు బడ్జెట్లో చూపారని రాష్ట్రంలో ఎంతమంది వ్యవసాయ కార్మికులు ఉన్నారనే లెక్క ప్రకటించలేదని తప్పుపట్టారు. పింఛన్లను రూ.4 వేలకు పెంచుతామని వాగ్దానం చేసి బడ్జెట్లో ఒక పైసా కేటాయించలేదనీ, కౌలు రైతులకు రూ.15 వేలు భరోసా ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ బడ్జెట్లో వారి పేరే ఉచ్చరించకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వ ద్వంద నీతికి నిదర్శనమని వ్యాఖ్యానించారు. మహిళలకు 2500 రూపాయలు ప్రకటనకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. బడ్జెట్ సమావేశాలు ముగిసే లోపల ఈ అంశాలపై పునర్ పరిశీలన చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు పాల్గొన్నారు.

ఎల్ఆర్ఎస్ అమలు కోసం రాష్ట్ర వ్యాప్తంగా బృందాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

లే అవుట్ క్రమబద్ధీకరణ పథకం(ఎల్ఆర్ఎస్) అమలు కోసం కొత్త జిల్లాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అధికారులను ఆదేశించారు. ఎల్ఆర్ఎస్ అమలుపై శుక్రవారం సచివాలయంలో రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి సమీక్ష నిర్వహించారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా అమలు చేయాలని ఉపముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ఎల్ఆర్ఎస్ విధివిధానాల కసరత్తుపై సమీక్ష నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 39 లక్షల దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయని, వీలైనంత వేగంగా పరిష్కరించాలన్నారు. జిల్లాల వారీగా బృందాలు ఏర్పాటు చేయాలని, సిబ్బంది కొరత ఉంటే ఇతర శాఖల నుంచి డిప్యుటేషన్‌పై తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి రామకృష్ణారావు, రెవెన్యూ, రిజిస్ట్రేషన్ల, శాఖల ముఖ్యకార్యదర్శులు నవీన్ మిట్టల్, జ్యోతి బుద్ధ ప్రకాష్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆమ్రపాలి, గృహనిర్మాణ శాఖ ప్రత్యేక కార్యదర్శి విపి గౌతమ్ తదితరులు పాల్గొన్నారు.

డివైడర్‌ను ఢీ కొట్టిన ఇన్నోవా

- ఇద్దరు మృతి ...12 మందికి గాయాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా శామీర్‌పేట మండలం జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలో ఇన్నోవా వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఆపై పల్టీ కొట్టి అవతలి వైపు వెళుతున్న ద్విచక్ర వాహనం, బీఈ కంపెనీ బస్సును ఢీకొన్నది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందారు. మరో 12మందికి గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం ఇన్నోవా వాహనం సిద్దిపేట రోడ్డు నుంచి హైదరాబాద్ వైపునకు వస్తోంది. జినోమ్ వ్యాలీ పోలీస్ స్టేషన్ పరిధిలోని లాల్‌గడి మలక్‌పేట గ్రామం విమల ఫీడ్స్ దగ్గరలో రాజీవ్ రహదారి మెయిన్ రోడ్డుపైన వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీ కొట్టడంతో పల్టీకొట్టింది. రోడ్డుకు మరోవైపు ఎదురుగా హైదరాబాద్ నుంచి తుర్కపల్లి వైపు వెళుతున్న యాక్టీవా వాహనంతోపాటు బయలాజికల్ ఈ లిమిటెడ్ కంపెనీకి చెందిన బస్సును ఢీ కొట్టింది. దాంతో ఇన్నోవా వాహనం నుజ్జు నుజ్జయింది. ఇన్నోవాలోని హాకింపేటకు చెందిన మోహన్(25), మౌలాలికి చెందిన దీపికా (23) అక్కడికక్కడే మృతిచెందారు. యాక్టీవాపై వెళ్తున్న వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బీఈ కంపెనీ ఉద్యోగులు సుమారు 10 మందికి, డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ రంగాన్ని మోసం చేసే బడ్జెట్

- కార్పొరేట్ సంస్థలకు పెద్దపీట
- రాష్ట్ర బడ్జెట్‌లో రుణమాఫీకి పూర్తి నిధుల్లేవ్..
- తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి సాగర్


సమావేశంలో మాట్లాడుతున్న టి.సాగర్

ప్రజాశక్తి-హైదరాబాద్‌బ్యూరో

కేంద్ర బడ్జెట్ వ్యవసాయ రంగాన్ని మోసం చేసేలా ఉందని, ఈ రంగాన్ని మోడీ ప్రభుత్వం బడా కార్పొరేట్ సంస్థలకు కట్టబెట్టేందుకు చూస్తోందని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.సాగర్ అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ అధ్యక్షతన 'కేంద్ర, రాష్ట్రాల బడ్జెట్లు 2024-25- వ్యవసాయ రంగం' అంశంపై శుక్రవారం రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సాగర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం రుణమాఫీ, వ్యవసాయ పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్‌పి) గ్యారంటీ చేస్తూ చట్టబద్ధత కల్పించాలని రైతులు ఆందోళనలు చేస్తుంటే బడ్జెట్‌లో ఆ ఊసే లేదన్నారు. స్వామినాథన్ సిఫారసుల అమలును పూర్తిగా వదిలేసినట్టు కనిపిస్తున్నదన్నారు. ఎంఎస్‌పి లేని పంట ఉత్పత్తుల ధరలు తగ్గిన పక్షంలో మార్కెట్‌లో జోక్యం చేసుకునే స్కీమ్‌లను పూర్తిగా ఎత్తేశారన్నారు. రైతుల ఆత్మహత్యల నివారణకు ఎలాంటి చర్యలూ తీసుకోలేదని చెప్పారు. ఫసల్ బీమాకు రూ.400 కోట్లు తగ్గించారని, పిఎం కిసాన్, గ్రామీణ ఉపాధి హామీ పథకానికి నిధులు పెంచలేదని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి భారీగా కేటాయింపులు చేసిందన్నారు. రుణమాఫీకి రూ.31 వేల కోట్లు అవసరమైతే బడ్జెట్‌లో రూ.26 వేల కోట్లు మాత్రమే రేవంత్ ప్రభుత్వం కేటాయించిందని తెలిపారు. ఇప్పుడు రూ.లక్ష లోపు మాఫీ చేశామని చెప్పినా వాటిలో సగం మంది రైతుల ఖాతాల్లో జమ కాలేదని తెలిపారు. కౌలు రైతుల విషయం బడ్జెట్‌లో ప్రస్తావించకపోవడం దారుణమన్నారు. సన్నధాన్యం పండించిన రైతులకే క్వింటాకు రూ.500 బోనస్ ఇస్తామనడం సరికాదన్నారు. సాగునీటికి కేటాయించిన బడ్జెట్‌లో మధ్య తరహా, భారీ ప్రాజెక్టులను పూర్తి చేయడానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఉద్యానవన శాఖకు కేటాయించిన బడ్జెట్‌ను రెట్టింపు చేయాలని, పామాయిల్, డెయిరీ రైతులకు సబ్సిడీలు పెంచాలని కోరారు.

రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ అరిబండి ప్రసాదరావు మాట్లాడుతూ.. కేంద్ర బడ్జెట్ వ్యవసాయరంగ కార్పొరేటీకరణను ప్రోత్సహించేలా ఉందన్నారు. కేంద్ర ప్రభుత్వ చర్యలు రైతుల నుంచి భూమిని లాక్కుని కంపెనీలకు ఇచ్చేలా ఉన్నాయని తెలిపారు. తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర అధ్యక్షులు జక్కుల వెంకటయ్య, కెవిపిఎస్ రాష్ట్ర అధ్యక్షులు జె.జాన్‌వెస్లీ మాట్లాడుతూ.. తెలంగాణకు సంబంధించిన ప్రాజెక్టులకు నిధులు కేటాయించడంలో, జాతీయ హోదా కల్పించడంలో కేంద్రం వివక్ష ప్రదర్శిస్తోందని చెప్పారు. డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి..శంకర్ మాట్లాడుతూ.. రైతు భరోసాకు సంబంధించి పరిమితిని ప్రకటించకపోవడం దారుణమన్నారు. తెలంగాణ గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు ఎం.ధర్మానాయక్, ఆర్.శ్రీరాంనాయక్ మాట్లాడుతూ.. సన్న, చిన్నకారు రైతులు వ్యవసాయం చేయలేని పరిస్థితిని కేంద్ర బడ్జెట్ తీసుకొచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎరువుల సబ్సిడీ తగ్గించడమంటే రైతులను వ్యవసాయానికి దూరం చేయడమేనన్నారు.

తగ్గుతూ...! పెరుగుతూ....!

- అధికారులను 'ముంపు' తిప్పలు పెడుతున్న గోదావరి


భద్రాచలంవద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న గోదావరి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తగ్గుతూ.. పెరుగుతూ.. భద్రాచలం వద్ద గోదావరి అధికారులను ముప్పు తిప్పలు పెడుతోంది. గురువారం మధ్యాహ్నం నుంచి తగ్గిన గోదావరి శుక్రవారం మధ్యాహ్నం నుంచి తిరిగి పెరగడం ప్రారంభించి ఇటు లోతట్టు ప్రాంత ప్రజలను, అధికారులను ఆందోళనకు గురిచేస్తోంది. ఒడిశా, ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో వర్షాలు కొంతమేరకు తగ్గినా, ఎగువ ప్రాంతంలో వర్షాలు తగ్గకపోవడంతో భారీగా వరద నీరు గోదావరికి చేరుతోంది. దాంతో భద్రాచలం వద్ద గోదావరి శుక్రవారం మధ్యాహ్నం నుంచి మళ్లీ పెరగడం ప్రారంభించింది. దిగువ ప్రాంతంలో ఉన్నటువంటి శబరి నది శాంతించి ఎదురుపోటు లేకపోవడంతో వరద ఉధృతి తీవ్రత కొంతమేర భద్రాచలం వద్ద తగ్గింది. శుక్రవారం రాత్రికి మరోసారి 48 అడుగులకు చేరుకొని రెండో ప్రమాద హెచ్చరిక స్థాయిలో ప్రవహించే అవకాశం ఉందని జల వనరుల శాఖ అధికారులు అంచనా వేస్తున్నారు.

ములుగు జిల్లా పేరూరు వద్ద గోదారి వేగంగా పెరుగుతుండటంతో భద్రాచలం అధికారుల్లో ఆందోళన పెరుగుతోంది. గోదావరి ప్రభావంతో జాతీయ రహదారుల వద్ద రాకపోకలు కొనసాగటం, కొంత సమయానికే మళ్లీ నిలిచిపోవడంతో సుదీర్ఘ ప్రాంతాల నుంచి వచ్చే భారీ వాహనాలు భద్రాచలం పట్టణంలోనే ఉండిపోవాల్సి వస్తుంది. పట్టణంలోని ఏఎంసీ కాలనీ, కొత్త కాలనీ, పరిసర ప్రాంతాల్లో స్లూయిజ్‌ల నుంచి లీకైన వరద నీరు వెనక్కి పోకపోవడంతో ఆయా కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎటపాక వద్ద ఉన్న స్లూయిజ్ లాకులు ఎత్తితే తప్ప, వరద నీరు వెనక్కి పోని పరిస్థితి ఉంది. 46 అడుగులకు గోదావరి తగ్గితేనే లాకులు ఎత్తే అవకాశం ఉందని అధికారులు చెప్పారు. దాంతో ఎన్ని రోజులు వరద నీటిలో ఉండాల్సి వస్తుందో తెలియక లోతట్టు ప్రాంత ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. ఇటు పోలవరం ముంపు మండలాల్లో సైతం అదే పరిస్థితి నెలకొంది.

పోలవరం పాపమే ఈ ముంపు

పోలవరం ప్రాజెక్టు పూర్తి చేస్తే భద్రాచలం నియోజకవర్గంతో పాటు కుక్కునూరు, వేలేరుపాడు మండలాలు జల సమాధి కాక తప్పదని 2006లోనే సిపిఎం ఆధ్వర్యంలో అనేక రకాల ఉద్యమాలు చేశారు. అప్పటి పాలకులు గాని, ఇతర రాజకీయ పార్టీలకు గాని ఆ సమస్యను పెద్దగా పట్టించుకోలేదు. కానీ గత పది రోజుల నుంచి కురుస్తున్న వర్షాల వల్ల గోదావరి పరివాహక ప్రాంతంలో భద్రాచలంతో పాటు విలీన మండలాలలోనే ఎక్కువ ఇబ్బందులు తలెత్తుతున్నాయి. పోలవరం ప్రాజెక్టు వద్ద కేవలం కాపర్ డ్యామ్ పూర్తయితేనే విలీనం మండలాలతోపాటు భద్రాచలం పట్టణానికి 45 నుంచి 50 అడుగులకు వరద వస్తుంది. ప్రాజెక్టు పూర్తయితే 50 నుంచి 60 అడుగుల వరకు గోదావరి నీటి మట్టం వస్తే ఈ ప్రాంతాల పరిస్థితి ఏంటిని ప్రజలు ఆందోళనకు గురవుతున్నారు. పోలవరం ముంపుపై నిర్దిష్టమైన కార్యచరణ చేపట్టకపోతే భవిష్యత్తులో భద్రాచలంతోపాటు విలీనం మండలాలు గోదారమ్మకు బలికాక తప్పదు.

వికలాంగుల సంక్షేమానికి నిధుల కేటాయింపుల్లో వివక్ష

- ఐదు శాతం నిధులు కేటాయించాలి : ఎన్‌పిఆర్‌డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వికలాంగుల సంక్షేమం, పునరావాసం కల్పన కోసం బడ్జెట్ కేటాయింపుల్లో వివక్ష చూపాయని ఎన్‌పిఆర్‌డి రాష్ట్ర కార్యదర్శి ఎం.అడివయ్య విమర్శించారు. వెంటనే ఆ బడ్జెట్లను సవరించి ఐదు శాతం చొప్పున నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. బడ్జెట్‌లో వికలాంగుల సంక్షేమానికి తక్కువ నిధులు కేటాయించడాన్ని నిరసిస్తూ శుక్రవారం హైదరాబాద్‌లోని ఆర్‌టిసి క్రాస్‌రోడ్డులో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బడ్జెట్లకు సంబంధించిన ప్రతులను దహనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కేంద్ర ప్రభుత్వం వికలాంగుల సాధికారతకు గతేడాది కంటే 0.02 శాతం అదనంగా పెంచిందనీ, బడ్జెట్ పదిశాతం పెరిగితే దానికి అనుగుణంగా ఎందుకు కేటాయింపులు పెంచలేదని ప్రశ్నించారు. 2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం ప్రకారం బడ్జెట్‌లో ఐదు శాతం నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సంక్షేమ పథకాల కోసం రూ.615.33 కోట్లు, పరికరాల కొనుగోలు కోసం రూ.315 కోట్లు కేటాయించి చేతులు దులుపుకున్నదని విమర్శించారు. దీన్ దయాల్ వికలాంగుల పునరావాస పథకాన్ని అర్భాటంగా ప్రచారం చేసుకుంటున్న కేంద్ర ప్రభుత్వం బడ్జెట్లో కేవలం రూ.165 కోట్లు కేటాయించిందని విమర్శించారు. నేషనల్ ఇనిస్టిట్యూషన్లకు, వికలాంగుల విద్యార్థులకు గతేడాది బడ్జెట్‌లో రూ.155 కోట్లు కేటాయించగా ఈ సారి రూ.142.68 కోట్లకు కుదించడం దారుణమని విమర్శించారు. వికలాంగుల క్రీడాకారులను ప్రోత్సహిస్తున్నామని ఒక వైపు చెబుతూ మరోవైపు రూ.76 కోట్ల నుంచి రూ.25 కోట్లకు కుదించడమేంటని ప్రశ్నించారు. ఆ సంఘం రాష్ట్ర కోశాధికారి ఆర్.వెంకటేశ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మ్యానిఫెస్టోలో వికలాంగులకు పొందుపర్చిన హామీలను విస్మరించిందన్నారు. పింఛన్‌ను రూ.6 వేలకు పెంచుతామని చెప్పి దానికి నిధులు కేటాయించకుండా మోసం చేశారని విమర్శించారు. వికలాంగుల పరికరాలు, స్వయం ఉపాధి రుణాల కోసం నిధులెందుకు కేటాయించలేదని ప్రశ్నించారు. నిరసన కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఎ.వెంకటేశ్, ఎన్‌పిఆర్‌డి నాయకులు బాలపీరు, గంగమ్మ, రాజు, నర్సింగ్, జాన్, నర్సింగ్ రావు, శంకర్ గౌడ్, డివైఎఫ్ఐ హైదరాబాద్ సిటీ అధ్యక్షులు అశ్విన్, నాయకులు రఘు పాల్గొన్నారు.


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కెటిఆర్

2 వరకు ప్రభుత్వానికి డెడ్‌లైన్

- కాళేశ్వరం నీటిని ప్రాజెక్టుల్లోకి ఎత్తిపోయాలి
- లేకుంటే 50 వేల మంది రైతులతో వెళ్లి మోటార్లు ఆన్ చేస్తాం : కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడిగడ్డలో జరిగిన చిన్న ఘటనను భూతద్దంలో చూపి కాంగ్రెస్ నేతలు చిన్నచూపు చూశారని, ఇక ప్రభుత్వ తీరును ఎండగడతామని, కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి నీటిని ఎత్తిపోయకపోతే కెసిఆర్ ఆధ్వర్యంలో 50 వేల మంది రైతులతో వెళ్లి తామే పంపులు ఆన్ చేసి నీటిని విడుదల చేస్తామని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ స్పష్టం చేశారు. ఇందుకు ఆగస్టు 2 వరకు ప్రభుత్వానికి డెడ్‌లైన్ విధిస్తున్నామని తెలిపారు. ప్రాజెక్ట్ సందర్శనలో భాగంగా శుక్రవారం జయశంకర్-భూపాలపల్లి జిల్లా పరిధి కాళేశ్వరంలోని ముక్తీశ్వర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మేడిగడ్డ (కన్నెపల్లి)కి కెటిఆర్ ఆధ్వర్యంలో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు గోదావరి నదికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పంప్ హౌస్ వద్ద ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కెటిఆర్ మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం, పార్టీ రాజకీయ కక్షపూరిత ధోరణితో వ్యవహరిస్తోందని ఆరోపించారు. బాబ్లీ ప్రాజెక్ట్ నుంచి నీళ్ల వచ్చే పరిస్థితి లేదని, ఉన్న నీటిని ఒడిసి పట్టుకోవాల్సిన సమయంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, భారీ నీటిపారుదల శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి.. వెంటనే వెళ్లి పంపు హౌస్‌లను ఆన్ చేసి రిజర్వాయర్లు, ప్రాజెక్టుల్లో నీరు నింపాలని డిమాండ్ చేశారు. రాష్ట్రానికి కాళేశ్వరం ప్రాజెక్ట్ బహుళ ప్రయోజనాలు ఇచ్చే ప్రాజెక్టు అని కెటిఆర్ అన్నారు. కేవలం రాజకీయ కక్షతో కెసిఆర్‌ను బదనాం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కుట్రపూరిత రాజకీయాలతో సాగునీరు అందించకుండా రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. సుందిళ్ల, అన్నారం ప్రాజెక్టులు బాగానే ఉన్నప్పటికీ ఎన్‌డిఎస్ఎ పేరుతో కాలయాపన చేస్తూ ప్రాజెక్టులో నీరు నిల్వ చేయడం లేదని ఆరోపించారు. ఎన్నికల తరువాత డిసెంబర్ నుంచి పంపులు ఆన్ చేసి పంటలకు నీరు ఇవ్వాలని తాము డిమాండ్ చేస్తున్నప్పటికీ రైతులను మోసం చేస్తూ యాసంగి పంటకు నీరు ఇవ్వకపోగా వర్షాకాలంలో ఇచ్చే పరిస్థితులు లేకపోవడంతో పరిస్థితిని పరిశీలించేందుకు ఇక్కడికి వచ్చినట్టు తెలిపారు. కన్నెపల్లి పంపు హౌస్‌లో 17 మోటర్లు రన్నింగ్ కండిషన్‌లో ఉన్నప్పటికీ రిజర్వాయర్లలో నీరు నింపే ప్రయత్నం చేయడం లేదని, ఫలితంగా లక్షల క్యూసెక్కుల నీరు సముద్రం పాలవుతున్నాయని ఆరోపించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై ఆధారపడిన రిజర్వాయర్లు ప్రాజెక్టులన్నీ నీటి నిల్వలు డెడ్ స్టోరేజ్‌కి పడిపోయాయని అన్నారు. వచ్చే నాలుగున్నర ఏండ్లు ప్రజల కోసం పనిచేయాలని, బేషజాలకు పోకుండా వెంటనే కన్నెపల్లి పంప్ హౌస్‌లో మోటర్లన్నీ ఆన్ చేసి రిజర్వాయర్లన్నీ నీటితో నింపి సాగునీరు, తాగునీరు ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టులపై రాజకీయం చేస్తున్నారని కొండపోచమ్మ సాగర్, మల్లన్నసాగర్, ఎస్సారెస్పీ, ఎల్ఎండీ, మిడ్ మానేరు ప్రాజెక్టుల్లో చాలా తక్కువ నీటి నిల్వలు ఉన్నాయన్నారు. వీటిని ఎత్తిపోతల ద్వారా నింపే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం మేడిగడ్డలో చిన్న లోపాన్ని భూతద్దంలో చూపించి మోటార్లు ఆన్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై అసెంబ్లీ సమావేశాల్లో రాష్ట్ర ప్రభుత్వాన్ని నిలదీస్తామని స్పష్టం చేశారు.

ఐపిఒకు స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్

Standard Glass Customer Inspired Excellence

హైదరాబాద్ : ఇంజనీరింగ్ పరికరాల తయారీలో ఉన్న హైదరాబాద్‌కు చెందిన స్టాండర్డ్ గ్లాస్ లైనింగ్ టెక్నాలజీ కొత్తగా ఇన్షియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపిఒ)కు రానుంది. దీనికి సంబంధించిన ప్రతిపాదిత పత్రాలను (డిఆర్‌హెచ్‌పి)ని సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజీ బోర్డు ఆఫ్ ఇండియా (సెబీ)కి సమర్పించినట్లు ఆ కంపెనీ తెలిపింది. రూ.10 ముఖ విలువ కలిగిన షేర్లను జారీ చేయడం ద్వారా రూ.250 కోట్లు, అదే విధంగా 18,444 మిలియన్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్‌లో జారీ చేయడంతో రూ.350 కోట్లు సమీకరించాలని నిర్దేశించుకుంది. ఈ నిధులను మూలధన వ్యయాలు, కొన్ని రుణాలను తిరిగి చెల్లించడానికి, సాధారణ పరిపాలన అవసరాల కోసం ఉపయోగించనున్నట్లు ఆ కంపెనీ తెలిపింది. ఈ ఇష్యూలో ఎస్2 ప్రమోటర్లు కందుల రామక్రిష్ణ, కందుల క్రిష్ణవేణి, నాగేశ్వర్‌రావు కందుల, కాట్రగట్ట మోహన్‌రావు, కాట్రగడ్డ శివప్రసాద్, కుండరవల్లి పున్నారావ తమ హోల్డింగ్స్‌లో కొంత భాగాన్ని విక్రయించనున్నారు. ఈ కంపెనీ రెవెన్యూ 2022-23లో రూ.497.59 కోట్లుగా ఉండగా.. 2023-24లో రూ.543.67 కోట్లకు పెరిగింది.

మార్కెట్‌లోకి క్లియర్ ప్రీమియం వాటర్

హైదరాబాద్ : ప్యాకేజ్డ్ వాటర్ సెగ్మెంట్‌లోని క్లియర్ ప్రీమియం వాటర్ హైదరాబాద్ మార్కెట్‌లోకి అడుగుపెట్టినట్లు తెలిపింది. అహ్మదాబాద్‌కు చెందిన తమ సంస్థ మిగిలిన నీటి సంస్థలతో పోలిస్తే కనీసం ఐదు కీలక భేదాలను కలిగి ఉంటుందని క్లియర్ ప్రీమియం వాటర్ వ్యవస్థాపక సిఇఒ నయన్ షా పేర్కొన్నారు. మార్చి 2025 నాటికి రిటైల్ నెట్‌వర్క్‌ను లక్ష అవుట్‌లెట్‌ల నుండి 1.75 లక్షల అవుట్‌లెట్‌లకు, తయారీ సౌకర్యాల సంఖ్యను 40 నుండి 55కి విస్తరించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు.



మార్కెట్లోకి యుపిఎల్ సాస్ 'సెకిటో'

ప్రజాశక్తి - హైదరాబాద్

వ్యవసాయ ఉత్పత్తుల సంస్థ యుపిఎల్ సాస్ లిమిటెడ్ కొత్తగా మార్కెట్లోకి 'సెకిటో' ఇన్సెక్టిసైడ్‌ను విడుదల చేసింది. హైదరాబాద్‌లో దీన్ని యుపిఎల్ సాస్ గ్రూప్ ఇండియా సిఇఒ ఆషిష్ ధోబాల్, మార్కెటింగ్ హెడ్ ప్రతాప్ రాంకంభ్, సౌత్ ఈస్ట్ బిజినెస్ హెడ్ జగదీష్ ఆవిష్కరించారు. అంతర్జాతీయ నాణ్యత ప్రమాణాలతో సెకిటోను అందుబాటులోకి తెచ్చామని ఆషిష్ తెలిపారు. పెరిగే కూరగాయలలో కాయ తొలుచు పురుగులు, రసంపీల్చు పురుగులను నియంత్రిస్తుందన్నారు.

ఇంజనీరింగ్‌లో అదనంగా 7,024 సీట్లకు అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రథమ సంవత్సరంలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోసం శుక్రవారం నుంచి రెండో విడత కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. రెండో విడతలో ఇంజినీరింగ్ కోర్సులకు సంబంధించి అదనంగా 7,024 సీట్లకు ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఈ మేరకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్, ఎప్‌సెట్ ప్రవేశాల కన్వీనర్ శ్రీదేవసేన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎప్‌సెట్ ఇంజినీరింగ్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో 78,694 సీట్లు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 75,200 మంది అభ్యర్థులకు సీట్లు కేటాయించామని తెలిపారు. వారిలో 55,941 మంది ఫీజు చెల్లించి సెల్ఫ్ రిపోర్టింగ్ చేశారని పేర్కొన్నారు. మొదటి విడతలో 22,753 సీట్లు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. రెండో విడత కౌన్సెలింగ్‌లో మొత్తం 29,777 సీట్లు అభ్యర్థులకు అందుబాటులో ఉన్నాయని వివరించారు. శనివారం ధ్రువపత్రాల పత్రాల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. శని, ఆదివారాల్లో వెబ్ ఆప్షన్లను నమోదు చేసేందుకు అవకాశముందని తెలిపారు. ఈనెల 31న రెండో విడత సీట్ల కేటాయింపు ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాల కోసం https://tgeapcet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.